కథ

# తిరిగి వచ్చిన బాల్యం

**ప్రతిరోజూ బద్ధకంగా ఏడింటికిగానీ లేవని భార్య ఆ రోజు ఉదయాన్నే హడావిడిగా పనులు ముగించుకుంటూ వుంటే "ఏమిటివాళ విశేషం? తెగ హడావుడి పడుతున్నావు?" అనడిగాడు శ్రీహరి.**

**"మరచిపోయారా! ఇవాళ శ్వేత రిపోర్ట్స్ వస్తాయి. దాని ప్రోగ్రెస్ రిపోర్ట్ తీసుకోవడానికి స్కూల్‌కి వెళ్ళాలి" కూతురికి తల దువ్వుతూ మధ్యలో దువ్వెనని తన జుట్టుముడిలో దోపి జడకి రబ్బర్‌బాండ్ బిగిస్తూనే సమాధానం చెప్పింది.**

''అంతేనా? కావల్సినంత టైముందిగా. ఎందుకూ హడావుడి?''

''ఇది హడావుడి కాదు. ఒక రకంగా టెన్షన్! చచ్చి చెడి నూరి నూరి పంపించాను. పర్సెంటేజ్ ఎలా వస్తుందో మరి.''

''పోన్లెద్దూ, థర్డ్‌స్టాండర్డ్‌లో దాని పర్సెంటేజీ గురించి అంత వర్రీ ఎందుకు? ఆడుకునే వయసు ఇంకా.''

''అవునవును.. అందరు పిల్లలకీ ఆడుకునే వయసే. అలా అని చదవడం మానేస్తున్నారా. ర్యాంకులు రావడం మానేస్తున్నాయా? అయినా మొక్కయి వంగనిది మానై వంగుతుందా అని ఇప్పటి నుంచీ స్కోర్ చేయకపోతే రేపు టెంత్, కాలేజీ లెవెల్‌కి వచ్చేటప్పటికి అత్తెసరు మార్కులే అలవాటవుతాయి. అయినా పిల్లలకి తక్కువ మార్కులు వస్తే మనకి మాత్రం అవమానం కాదూ?''

శ్రీహరి ఏం సమాధానం చెప్పలేదు.

★ ★ ★

''అయింది.. నేననుకున్నంతా అయింది. ఇదిగో ఇలా తగలడ్డాయి మార్కులు. ఛీ...ఛీ... రాత్రీ పగలూ కూర్చోబెట్టి నూరిపోసాను. తీరా చూస్తే నిర్వాకం ఇది'' ప్రోగ్రెస్ రిపోర్ట్ తీసుకువచ్చి భర్తవైపు విసిరికొట్టింది. శ్రీహరి ఓపెన్‌చేసి చూసాడు.

ఎనభై శాతం వచ్చాయి మార్కులు. కొన్ని సబ్జెక్ట్‌లో తక్కువ వచ్చాయి.

''ఏమైంది నీరజా! ఎయిటీ పర్సెంట్ వచ్చిందిగా''

''ఆ వచ్చింది.. బోడి ఎయిటీ పర్సెంట్... మా లేడీస్ క్లబ్‌లో అందరి పిల్లలకీ నైన్టీ ఫైవ్‌కి తగ్గవు. రేపు నేను ఏ ముఖం పెట్టుకుని నా కూతురికి ఎయిటీ పర్సెంట్ వచ్చాయని చెప్పను?'' గయ్యిమంది నీరజ.

శ్వేత బిక్కముఖం వేసుకుని సోఫాలో కూర్చుంది. అప్పటికి ఎన్ని తిడుతూ స్కూల్ నుంచి తెచ్చిందో తెలియదుకానీ ఆ పసిదాని ముఖంలో ఎక్కడా కళాకాంతి లేదు.

చిన్నబోయి వున్న కూతురి ముఖంవైపు జాలిగా చూసాడు శ్రీహరి.

ఇప్పుడు తనేమన్నా నీరజ మరింత రెచ్చిపోయి ఆ కోపాన్ని కూతురి మీద చూపిస్తుంది. ఫలితం.. ఆ పసిదాని మనసు మరింత గాయపడుతుంది.

''ఆ ముఖం చూడు... ఏమీ ఎరగనట్లు ఎలా పెట్టుకుందో. ఛీ...ఛీ... ఇవి మార్కులా. ఎంత అసహ్యంగా ఉంది. నాకేం నచ్చలేదు శ్వేతా! సారీ... అయామ్ వెరీ అన్‌హ్యాపీ''

దెబ్బతిన్నట్టుగా చూసింది శ్వేత. ఈ మాట ఇప్పటికే పదిసార్లు విన్నది. విన్న ప్రతిసారీ గుండెల్లో గుచ్చుకుంటోంది.

కాలింగ్ బెల్ శబ్దం విని తలుపు తీసిన నీరజ ఎదురుగా మిత్రురాలు ప్లస్ ఆడపడచు అయిన వారిజని చూడగానే సర్‌ప్రైజ్ అయింది.

''ఏయ్ వారిజా! వాటె సర్‌ప్రైజ్! ఎప్పుడొచ్చావు? ఇదేమిటి ఉత్తరమూ, ఫోనూ ఏమీ లేకుండా?''

''ఇదిగో నీకిలా సర్‌ప్రైజ్‌చేద్దామనే. కాకపోతే మా అన్నయ్యకి తెలుసనుకో. నేనే చెప్పొద్దన్నాను. లేకపోతే ఆఫీస్ మానేసి వాడు ఇంట్లో ఎందుకున్నాడనుకున్నావు?''

''నిజమే సుమా! నా ధోరణిలో నేను గమనించనే లేదు. నిజమేనా.. మీకు తెలిసీ నాకు చెప్పలేదన్న మాట''

''అదిగో మా అన్నయ్యకేసి అలా కళ్ళెర్ర చేయకు. నేనే చెప్పొద్దన్నాను. పాపం వాడేం చేసాడు? హాయ్ శ్వేతూ! హౌ ఆర్ యూ నాన్నా. ఏమిటి ముఖం అదోలా వుంది?'' లాలనగా మేనకోడలి బుగ్గలు నిమిరింది వారిజ.

మేనత్తని చూడగానే ముఖం వికసించబోయినా తల్లి చూపుల్లో తీక్షణతకి మళ్ళీ ముకుళించుకుపోయింది ఆ పిల్ల ముఖం. ఓమారు తల్లివైపు చూసి రెప్పలు వాల్చుకుంది.

''సాధించిన నిర్వాకానికి ముఖం అలాకాక ఇంకెలా ఉంటుందిలే. నీ విశేషాలేమిటి? స్టేట్స్ నుంచి ఎప్పుడొచ్చావు? సడన్‌గా ఎలా వచ్చావు. నీ రీసెర్చ్ ఎంత వరకూ వచ్చింది?''

''రీసెర్చ్ బ్రహ్మాండంగా సాగుతోంది. మా మరిదికి అనుకోకుండా పెళ్ళిముహూర్తం కుదిరింది. నాకూ శెలవు దొరికింది. ఇంకేముంది వచ్చేసాను. పెద్దకోడలిని కదా హడావుడంతా నాదేమరి...''

నవ్వుతూ బేగ్‌లోంచి చాక్లెట్ టిన్ తీసి శ్వేతకి అందించింది.

ఆమె నిరాసక్తిగా అది అందుకుని పక్కన పెట్టేయడం ఇద్దరే గమనించారు- శ్రీహరి, వారిజ!

తర్వాత చెల్లెలితో మరో పది నిముషాలు మాట్లాడి ఆఫీస్‌కి వెళ్ళిపోయాడు శ్రీహరి.

''ఏమైంది నీరూ! శ్వేత ఎందుకలా వుంది. ఎప్పటిలా లేదేం. ఒంట్లో బాగాలేదా?'' రెట్టించి అడిగింది వారిజ.

''ఏం చెప్పమంటావ్.. దీనికసలు చదువు వంటపడుతుందా అని నా అనుమానం. ఏ పరీక్ష వచ్చినా చివరికి చిన్న యూనిట్ టెస్ట్ అయినా కూర్చోబెట్టి అరగదీసి మరీ ప్రిపేర్ చేస్తాను. మా సర్కిల్లో అందరి పిల్లలూ జెమ్స్‌లా ఉంటారనుకో. ఒక్కొక్కరికీ నైన్టీ ఎయిట్‌లూ హండ్రెడ్ మార్క్స్ వస్తాయి. దీనికి మొన్న హాఫ ఇయర్లీలో వచ్చిన పర్సెంటేజీ ఎంతో తెలుసా? ఎయిటీ ఫైవ్''

''బాగానే వచ్చాయిగా...''

''ఏమిటి వారిజా! నువ్వు కూడా అలాగే మాట్లాడతావు. ఎయిటీఫైవ్ పర్సెంట్ వచ్చిందని ఏ ముఖం పెట్టుకుని మా వాళ్ళతో నేను చెప్పాలి. వాళ్ళు నా గురించి ఏం అనుకుంటారు''


వారిజకి నవ్వాలో ఏడవాలో అర్థం కాలేదు ఆమె ధోరణికి.

''అంటే మీ సర్కిల్లో- మీ వాళ్ల దగ్గర నీ పరువు నిలబెట్టుకోడానికి దాన్ని చావగొట్టి అయినా సరే సెంట్ పర్సెంట్ మార్కులు తెప్పించాలన్న మాట. అంతేగా?''

''అదికాదు వారిజా! రేపు ఫ్యూచర్లో ఎంత కాంపిటీషన్ వుంటుంది. ఈ స్టేజ్‌లో దాన్ని ప్రిపేర్ చేయకపోతే రేపు ఏ టెస్ట్‌కైనా పనికొస్తుందా?''

''అది వేరే దృక్పథం. కానీ నువ్వు ఆ వ్యూలో కన్నా నీ ప్రిస్టేజ్ ఇష్యూగా దీన్ని తీసుకుంటున్నావని నాకు అనిపిస్తోంది. ఎందుకంటే ఫ్యూచర్లో తట్టుకోవడం కోసం ప్రిపేర్ చేసే పద్ధతి వేరుగా ఉంటుంది. అప్పుడు లైఫ్‌లో ప్రతి విషయంలో ఎక్సెల్ చేయాలనే భావన వాళ్ళ మనసులో నాటాలి. అప్పుడు వాళ్ళంతట వాళ్ళే శ్రమిస్తారు. ఇప్పుడు నువ్వు పదిసార్లు దానిముందు ఒకటే మాట అంటున్నావు. నా పరువు తీసావు, నా పరువు తీసావు అని. అందువల్ల

దాని లేత మనసు హర్ట్ అవడమే కాకుండా చదువంటే ఒక రకమైన విముఖత ఏర్పడే అవకాశం చాలా వుంది. ఒక విషయం మనని మానసికంగా చాలా ఎక్కువ బాధ పెట్టినప్పుడు ఆ విషయం పట్ల కోపం, ఎవర్షన్ కలగడం సహజం. ఏ రోజైతే చదువుపట్ల దానికా ఫీలింగ్ కలిగిందో దాన్ని మార్చడం నీ తరం కాదు. కొంత వయసూ, జ్ఞానం వచ్చాక మనలో కలిగే భావాలకి ఫ్లెక్సిబిలిటీ వుంటుంది. కానీ ఇది చాలా లేత వయసు. ఈ వయసులో ఒక అభిప్రాయం, ఒక భావం ముద్రపడితే దాన్ని జీవితాంతం చెరపలేము. ఇప్పటిరోజుల్లో కాంపిటీషన్ ఎక్కువ అన్నది నిజమే కావచ్చు. కానీ దాన్ని దృష్టిలో పెట్టుకుని వాళ్ళని రాత్రీ పగలూ అరగదీస్తే వాళ్ళకి భవిష్యత్ పట్ల ఆశకి బదులు భయం, పిరికితనం చోటుచేసుకుంటాయి. మన ఆశయాలనీ, కోరికలనీ వాళ్ళపై రుద్దేముందు ఒక్క క్షణం... ఒకే ఒక్క క్షణం వాళ్ళ ఏజ్ గురించి ఆలోచిస్తారా? వాళ్ళ లేత మెదడు, దానికుండే కెపాసిటీ, వాళ్ళ మనస్తత్వం, వాళ్ళ కోరికలు, ఇష్టాలు, వాళ్ళ టాలెంట్ ఇవేవీ దృష్టిలో పెట్టుకోరా? మాట్లాడితే ఇది పోటీ ప్రపంచం అంటూ వాళ్ళ బాల్యాన్ని చంపేసి, అడ్డమైన సిలబస్ వాళ్ల బుర్రలోకి ఎక్కించి వాళ్ళలో సహజంగా వుండే సృజనాత్మకతని చంపేసి ఎలాగోలా మీ కోరికలు వాళ్ళలో తీర్చుకుందాం అనుకుంటారు. ఆ ఆత్రంలో తొందరపాటులో కన్నవాళ్ళకి వుండే కనీస మమకారాన్ని కూడా అణగదొక్కి వాళ్ళని డామినేట్ చేస్తూ వుంటారు.



ప్రోగ్రెస్ రిపోర్ట్ చూడగానే ప్యాంట్ కుండే బెల్ట్ విప్పి కొడుకుని వాతలు తేలేలా కొట్టిన తండ్రి నాకు తెలుసు. మార్కులు తక్కువొచ్చాయని పనిష్మెంట్ క్రింద బాత్‌రూమ్‌లో లైటార్పేసి పిల్లాడిని లోపల పెట్టి గడియపెట్టిన తల్లిని నేను చూసాను. గంట తర్వాత తలుపు తీస్తే ఆ అబ్బాయి స్పృహ తప్పి ఉన్నాడు. ఆ స్పృహ తప్పే ముందు ఆ అబ్బాయి ఎంత టార్చర్ అనుభవించి వుంటాడో ఆ తల్లి ఊహించగలదా? ఎగ్జామ్‌లో ఫెయిలైతే పిల్లలు ఆత్మహత్య చేసుకుంటే ఆ తప్పు వాళ్ళదా లేక ఎగ్జామే జీవితం దాన్ని పాసవడమే పరమార్థం అనిపించేలా వాళ్ళని పెంచిన తల్లిదండ్రులదా? కెజి నుంచి పిజివరకూ ప్రతిసారీ వంద మార్కులు తెచ్చుకున్న వాళ్ళు కూడా సరైన ఆలోచనా దృక్పథం లేకపోతే జీవితంలో ఎందుకూ పనికి రారు. ఏ ఎంప్లాయరూ డిగ్రీలో నీకెన్ని మార్కులు వచ్చాయని చూడడు. డబ్బిస్తున్నందుకు వాడి పని నువ్వెలా చేస్తున్నావనే చూస్తాడు.

బిజినెస్‌లో నీ క్వాలిఫికేషన్ చూడరు. నువ్వెంత సంపాదించావు, ఎలా సంపాదించావు అన్నది చూస్తారు.

డాక్టరయ్యాక మెడిసిన్‌లో వాడు సంపాదించే మార్కులతో పేషెంట్లు రారు. వాడి ప్రవర్తనా, వాడి ట్రీట్‌మెంట్‌ని బట్టి వస్తారు.

పిల్లల్లో ముఖ్యంగా పెంపొందించాల్సింది ఆత్మవిశ్వాసం, పాజిటివ్ ఏటిట్యూడ్, సమస్యని ఎదుర్కోగలిగే సమయస్ఫూర్తి, ముఖ్యంగా.. అతి ముఖ్యంగా సాటి మనిషి సమస్యకి స్పందించగలిగే మానవతా దృక్పథం. అది ఉన్నవాడు తమ జీవితంలో ఎదురయ్యే ప్రతి మనిషినీ, ప్రతి పరిస్థితినీ వాళ్ళు అర్థం చేసుకోగలుగుతారు.

కనుక దయచేసి మీ ఆలోచనా విధానాన్ని మార్చుకోండి. వాళ్ళ భవిష్యత్‌ని నిర్మించే ప్రయత్నంలో వాళ్ళకి శత్రువులుగా మారకండి. ముందు వాళ్ళు మన కన్నపిల్లలు. ఆ తర్వాతే స్టూడెంట్లు, డాక్టర్లు, ఇంజనీర్లు. మమకారాన్ని కూడా చంపేసుకుని వాళ్ళని అంతలా హింసించాల్సిన అవసరం లేదు. ఇంకా ఓపిక స్తోమత వుంటే.. వాళ్ళలో స్వతహాగా వచ్చిన టాలెంట్ ఏదైనా వుంటే దాన్ని గుర్తించి ప్రోత్సహించండి. దానిలో వాళ్ళు తప్పకుండా పైకొస్తారు. అప్పుడు వాళ్ళకీ తృప్తి వుంటుంది. మీకూ తృప్తి వుంటుంది.

ముఖ్యంగా మరో విషయం నీరూ! పిల్లలు సంపాదించే మార్కులు మన ప్రిస్టేజ్ ఇష్యూ కాకూడదు. అది చాలా తప్పు. మార్కుల మత్తులోపడి మాటలతో టార్చర్ చేస్తున్నావేగానీ తల్లిగా ఒక్క క్షణం ఆలోచిస్తే దానిలో వచ్చిన మార్పుని గుర్తుపట్టగలిగే దానివి.

చాక్లెట్లు అంటే ప్రాణం దానికి. అలాంటిది ఎంత నిరాసక్తిగా ఆ బాక్స్ పక్కన పెట్టేసిందో అబ్జర్వ్ చేసావా? అది కోపంగా పక్కన పడేస్తే నేను నవ్వుకునే దాన్ని. కానీ నిర్లిప్తంగా అందుకుని ఉంచేయడం అదెంత బాధపడుతోందో అర్థం అయింది''

వారిజ కళ్ళల్లో నీరు తిరిగింది. నీరజ గిల్టీగా తల దించుకుంది.

''పిల్లలు మన ఆశయాలు తీర్చే యంత్రాలు కారు నీరజా! మనం గడిచిపోయిందనుకున్న మన బాల్యం వాళ్ళు. తిరిగి వచ్చిన మన బాల్యం వాళ్ళు. ఆ తీపి బాల్యాన్ని మనం మరోసారి ఎంజాయ్ చేద్దాం. వారిని ఎంజాయ్ చేయనిద్దాం. కమాన్! పులిహోర, పూరీలు కూరా అన్నీ చేయి. ఇవాళ పిల్లల్ని తీసుకుని పిక్నిక్‌కి వెళ్దాం. హాయిగా ఆడుకుని వద్దాం ఓకె.''

హుషారుగా శ్వేత దగ్గరికి నడిచింది వారిజ.

పిల్లలంటే తిరిగి వచ్చిన మన బాల్యం అన్న వారిజ మాటలు గుర్తుచేసుకుంటూ ఆమెను అనుసరించింది నీరజ.

**శివల పద్మ**

✤